క్లుప్తంగా

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

ఉదయగిరి : వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం మర్రిపాడు మండలం బ్రహ్మణపల్లిలోని మేకపాటి రాజగోపాల్‌రెడ్డి నివాసంలో ఆదివారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి మండలాధ్యక్షుడు గానుగుపెంట ఓబులరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, పార్టీ యువ నేత మేకపాటి అభినవరెడ్డి పాల్గొంటారని తెలియజేశారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నేతలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఆర్బీకేలో ఏఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ చెన్నారెడ్డి

సీతారామపురం : స్థానిక బిట్–1 పరిధిలోని రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డుల పరిశీలనతో పాటు పచ్చిరొట్ట విత్తనాల నిల్వలను తనిఖీ చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు లక్ష్మీనారాయణ, హాజీర, ఎంపీఈఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి అభివృద్ధికి సహకరించండి

ఉదయగిరి : జిల్లాలో వెనుకబడిన ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ బాబు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామానారాయణరెడ్డిని కోరారు. అమరావతిలో వారిని ఆయన శనివారం మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా తాగునీటికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎంపీ నిధులు ఇచ్చి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని కోరారు.

కలిగిరిలో ధర్మ ప్రచారం



ధర్మ ప్రచారం చేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కలిగిరి : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా ధర్మ ప్రచారక్ కర్రా భాస్కర్ తెలిపారు. కలిగిరిలోని శ్రీశిరిడీ సాయిరామ్ డిగ్రీ కళాశాల ఆవరణలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిగిరి, కొండాపురం, జలదంకి, వింజమూరు మండలాల పరిధిలో 16వ విడత ఇంటింటి ధర్మ ప్రచార కార్యక్రమాలు ప్రారంభిస్తున్నామన్నారు. హిందూ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల గురించి ప్రతి కుటుంబానికి వివరిస్తామన్నారు. భారత దేశమే కాకుండా మన సంస్కృతిని ప్రపంచ దేశాలు పాటిస్తున్నాయన్నారు. అనంతరం ప్రచారం చేశారు. కార్యక్రమంలో మహిళా కనీ ్వనర్ అంజమ్మ, అర్చకులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజానుకూల పాలన చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘ రాష్ట్ర నేత రామ్‌భూపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ : రాష్ట్రంలో కొత్తగా కొలువు దీరిన ప్రభుత్వం ప్రజానుకూల పాలన సాగించాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు రామ్ భూపాల్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన శనివారం హాజరై, మాట్లాడారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీకి ఇతర పార్టీలపై ఆధారపడి ప్రభుత్వ నిర్వహణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ప్రజావ్యతిరేక, కార్మిక, కర్షక విధానాలను అనుసరించడంతో పాటు మతతత్వ రాజకీయాలను చేయడం వల్లే బీజేపీ అయోధ్యలో సైతం ఓడిపోయిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజలకు, కార్మికులకు మేలు జరిగేలా పాలన చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆత్మకూరు మండలం నారంపేటలోని ఎంఎస్ఎంఈ పార్క్‌లో పరిశ్రమల ఏర్పాటుకు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత జీవీ శివప్రసాద్, మండలాధ్యక్షుడు ఆత్మకూరు నాగయ్య, కార్యదర్శి కొండమూరు హజరత్తయ్య, జిల్లా రైతు సంఘ నేతలు లక్ష్మీపతి, ఏపీ రైతు సంఘ కార్యదర్శి కృష్ణప్రసాద్, సీపీఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, డీవైఎఫ్ఐ నాయకుడు నందా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలల్లో చేర్పించండి



ఆత్మకూరురూరల్ : ప్రభుత్వ బడుల్లో పిల్లలను చేర్చాలని కోరుతూ ర్యాలీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు

సీతారామపురం : బడి ఈడు పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈఓ మస్తాన్‌వలి కోరారు. మండలంలోని నెమళ్లదిన్నె గ్రామంలో ఆయన శనివారం పర్యటించారు. తల్లిదండ్రులు పిల్లలను వ్యవసాయ, కూలి పనులకు పంపకుండా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 12వ తేదీ వరకు నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహిస్తున్నందున ప్రతి పంచాయతీలో సంబంధిత అధికారులు ఇంటింటికి వెళ్లి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. అనంతరం అన్వేష్ కుమార్ అనే బడి బయట బాలుడిని గుర్తించి స్థానిక ఎంపీయూపీ స్కూల్‌లో ఆరో తరగతిలో చేర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, వెల్ఫేర్ అసిస్టెంట్, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఆత్మకూరులో ర్యాలీ

ఆత్మకూరురూరల్ : విద్యతో పాటు సకల సదుపాయాలు ఉన్న ప్రభుత్వ బడుల్లోనే తమ చిన్నారులను చేర్పించాలని కోరుతూ విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు శనివారం ఆత్మకూరులో ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ నుంచి విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తూ బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపాలని ప్రచారం చేశారు. బీఎస్సార్ సెంటర్, సోమశిల రోడ్డు, ఎల్ ఆర్‌పల్లి మీదుగా సాగిన ర్యాలీలో ఆత్మకూరు ఎంఈఓ–2 చలపతి, ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి, సీఆర్‌పీలు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీతారామపురం : బడి బయట బాలుడిని పాఠశాలకు తీసుకెళ్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి



ఆత్మకూరురూరల్ : బీఎస్సార్ సెంటర్‌లో..

వెంగమాంబ బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- నిలుపుతో ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో వెంగమాంబ దంపతులు

దుత్తలూరు : జిల్లాలో ప్రసిద్ధి చెందిన నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో ప్రారంభం కానున్నాయి. అందుకు తగ్గట్లు వ్యవస్థాపక ధర్మకర్తల మండలి, దేవదాయశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవస్థానం ఎదురుగా ఉన్న యాగశాలలో ఆదివారం ఉదయం హోమం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. అనంతరం వెంగమాంబ, గురవయ్య దంపతులను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన తదితర పూజలు నిర్వహిస్తారు. రాత్రికి అమ్మవారి పుట్టినిల్లు అయిన వడ్డిపాళెంలోని రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయంలో పచ్చవ వంశస్తులు పసుపును దంచి లాంఛనంగా బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుడుతారు. ఈ పసుపు దంచే కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తిని చాటుకుంటారు. దేవస్థానం వద్ద భక్తుల దర్శనం కోసం ప్రత్యేక క్యూ లైన్‌లు ఏర్పాటు చేశారు.

వైభవంగా ఆత్మారాముని రథోత్సవం



నందివాహన సేవలో కోటేశ్వరస్వామి



అన్నారెడ్డిపాళెంలో రథాన్ని లాగుతున్న భక్తులు

సంగం : మండలంలోని అన్నారెడ్డిపాళెంలో ఉన్న ఆత్మారాముని ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంలోని ఆత్మారామ స్వామిని రథంపై ఉంచి భారీ గజమాలలతో సుందరంగా అలంకరించారు. జైజై రామా అంటూ భక్తులు ఆత్మారాముని రథాన్ని లాగుతూ ముందుకు సాగారు. పురవీధుల్లో భక్తులు రథచక్రాల కింద గుమ్మడికాయలు ఉంచి మిరియాలు చల్లారు. పలువురు భక్తులు నారికేళాలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా పలుచోట్ల భక్తులకు పానియాలు అందజేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంగం పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

నంది వాహనంపై కోటేశ్వరుడు

మండలంలోని దువ్వూరులో ఉన్న గంగా పార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నంది వాహనంపై గంగా పార్వతి సమేత కోటేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై ఉంచి పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం వేదపండితుడు చదలవాడ శివకుమారశర్మ ప్రత్యేక పూజలు జరిపించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. దువ్వూరు గ్రామంలోని భక్తులు నంది వాహనంపై విచ్చేసిన పార్వతి పరమేశ్వరులకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వెంగన్నపాళెం సర్పంచ్‌కు మేకపాటి పరామర్శ



సర్పంచ్ వెంగయ్యను పరామర్శిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు : మండలంలోని వెంగన్నపాళెం సర్పంచ్ తిప్పిరిబోయిన పెదవెంగయ్య సతీమణి కనకమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి వెంగన్నపాళెంలోని వెంగయ్య నివాసానికి శనివారం వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కనకమ్మ మృతిపట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, పార్టీ నాయకులు తుమ్మల వెంగయ్యచౌదరి, కండ్లగుంట వెంకటరెడ్డి, అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, తిరుపాల్ నాయుడు, మాల్యాద్రి, కంభం మురళీమోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

డయేరియాపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

అల్లూరు : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో డయేరియాపై ఎంపీడీఓ జ్యోతి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు జరపాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు సేవించాలన్నారు. ఎక్కడైనా డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఫణికుమార్, ఈఓపీఆర్డీ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీలు

సీతారామపురం : స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. స్టాకు వివరాలను పరిశీలించి, నగదు లావాదేవీలపై ఆరా తీశారు. నిబంధనల ప్రకారం మద్యం విక్రయాలు జరపాలని సిబ్బందికి సూచించారు. తనిఖీల పేరుతో ఎక్సైజ్ అధికారులు మద్యం దుకాణాలను గంటల తరబడి మూసి వేయడంతో మందుబాబులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.



మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

మర్రిపాడు : మండలంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం రెండో రోజు నిర్వహించారు. డీసీపల్లి, నందవరం, రాంపల్లి, చిన్నమాచనూరు, భీమవరం, మర్రిపాడు, పొంగూరు, పల్లవోలు పాఠశాలల్లో ఉపాధ్యాయులచే సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎం.సుధాకర్‌రెడ్డి పాల్గొని, మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తోందని, మర్రిపాడు మండలంలో 180 మందికి పైగా సభ్యత్వం స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వెంకటేశ్వర్లురెడ్డి, మండల గౌరవాధ్యక్షుడు శివరామిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరాజు, శివయ్య, పెంచలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌గా వార్డు సచివాలయం

- ఆగమేఘాల మీద చర్యలు



వార్డు సచివాలయ భవనానికి వేసిన పసుపు రంగు

ఆత్మకూరురూరల్ : పట్టణంలోని ఎంజీఆర్ బస్‌స్టేషన్ సమీపంలో నిర్వహిస్తున్న వార్డు సచివాలయ భవనాన్ని అన్న క్యాంటీన్‌గా మారుస్తున్నారు. ఈ మేరకు మున్సిపాలిటీ అధికారుల ఆదేశాలతో శనివారం ఆగమేఘాల మీద చర్యలు చేపట్టారు. మూడు వార్డులకు సంబంధించి సచివాలయం ఇటీవల వరకు ఈ భవనంలోనే కార్యకలాపాలు జరిగేవి. ప్రస్తుతం ఇక్కడ నిర్వహిస్తున్న సచివాలయాన్ని ఇదే భవనం వెనుక ఉన్న పాత ప్రభుత్వ ఆస్పత్రి భవనంలోకి మార్చారు.

నేత్రపర్వం.. కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

ఉదయగిరి : మండలంలోని గంగిరెడ్డిపల్లిలో శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య జరిగిన కల్యాణాన్ని భక్తులు తిలకించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



చెర్లోయడవల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం

ఆత్మకూరురూరల్ : మండలంలోని చెర్లోయడవల్లిలో ప్రవాస భారతీయురాలు డాక్టర్ ప్రమీల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. 150 మంది రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్‌లతో పాటు పలు వ్యాధులకు ఉచితంగా మందులు అందజేశారు. అలంబన ఫౌండేషన్ ఇండియా వారు వైద్యశిబిరానికి సరిపడా మందులను సమకూర్చగా, మాజీ సర్పంచ్ కేతా విజయభాస్కర్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మాధురి, ప్రతిమ, సుప్రజ, రషీదా, ఉషా, స్థానిక యువకులు పాల్గొన్నారు.

కమనీయం.. కోదండరాముని కల్యాణం



మంగళసూత్రాన్ని భక్తులకు చూపిస్తున్న వేదపండితుడు

సంగం : మండలంలోని తరుణవాయి పంచాయతీలో ఉన్న కోదండ రామస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి కమనీయంగా జరిగింది. సీతా లక్ష్మణ సమేతుడైన కోదండరామున్ని వేద పండితులు మండపంలో ఆశీనులను చేశారు. శ్రీరామచంద్రుడు, సీతమ్మ తల్లిని విశేషంగా ముస్తాబు చేశారు. అనంతరం వందలాది మంది భక్తుల నడుమ వేద పండితుడు ప్రసాద్‌శర్మ మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. ఆనందోత్సాహాల నడుమ భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



కల్యాణ మహోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

భూసార పరీక్షలపై అవగాహన కల్పించండి



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

కొండాపురం : భూసార పరీక్షలపై అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలని కొండాపురం ఇన్‌చార్జి ఏఓ ఎస్.శ్రీహరినారాయణ తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురంలో భూ ఆరోగ్య, భూసార పథకం కింద రైతుల పొలాల్లో శనివారం మట్టి నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపురం మండల పరిధిలో 456 మట్టి నమూనాలు సేకరించి గ్రామీణ వ్యవసాయ సహాయకులకు సూచనలు అందించినట్లు తెలిపారు. ఈ నమూనాలను నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రాలకు పంపి ఫలితాలను రైతుల ఫోన్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారని వివరించారు. ఈ పరీక్షల వల్ల వివిధ పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయనే విషయం తెలుసుకోవచ్చని, ఏ మోతాదులో వినియోగించుకోవాలో స్పష్టంగా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కందుకూరి ఈశ్వరాచారి, వీఏఏలు పాల్గొన్నారు.